క్లుప్తంగా

ఆలయ అభివృద్ధి పనులకు వితరణ



వితరణ అందుకుంటున్న పాలకవర్గ సభ్యులు

గుడివాడటౌన్ : స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనులకు భక్తులు విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం బుధవారం తెలిపారు. పట్టణానికి చెందిన రాయల అప్పారావు–నాగరత్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఆంజనేయ రత్నప్రసాద్–వెంకట లలిత కుమారి దంపతులు రూ. 10,116, కోనా స్రవంతి రూ. 10,116, కాగిత రామచంద్రరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు రామకృష్ణ, విజయకృష్ణ రూ. 10,116 వితరణగా ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాంబాబు, పాలక మండలి సభ్యులు సాంబశివరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యాన గుడ్లవల్లేరు సెంటర్‌లో బుధవారం చలివేంద్రాన్ని లయన్స్ సెకండ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దే శేషగిరి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు శింగంశెట్టి ఆదినారాయణ, లయన్స్ ప్రతినిధులు కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని వెంకట్రావు, పొట్లూరి రవి, పోలవరపు వెంకట్రావు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వరకు గోపూజ

మండవల్లి: స్థానిక శ్రీ దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో ఉగాది నుంచి 30వ తేదీ వరకు శోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రతిరోజు సాయంత్రం సంధ్యహారతి, సాయి నక్షత్రమాలిక, మహా యజ్ఞపారాయణం, అనంతరం గోమాత దీపోత్సవ కార్యక్రమం, గోపూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై దాడి జరిపి పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని దేవరపల్లిలో జరిగింది. గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఎస్‌ఐ జి. రమేష్ ఆధ్వర్యాన పోలీసులు బుధవారం దాడి జరిపి ఏడుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2200 నగదు, రెండు బైక్‌లు,రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణం పూర్తి చేయాలి

ముదినేపల్లి రూరల్: గ్రామీణ ప్రజలకు ప్రభుత్వం తరఫున వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ అండ్ వెల్నెస్ సెంటర్ భవన నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. మండలంలోని చేవూరులో చేపట్టిన భవన నిర్మాణ పనులను ఎంపీపీ బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణం సత్వరమే పూర్తిచేసి ప్రారంభించాల్సిన ఆవశ్యత ఉందని కాంట్రాక్టర్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, స్థల దాత కోతుల సాయి, పార్టీ నేతలు కోమటి విష్ణువర్థన్, రాచూరి కుమార్, గంటా కోటేశ్వరరావు, సుబ్బారావు, బాపూజీ, పేతు రాజా, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

- పలు అవకతవకలు గుర్తింపు
- రూ.95 వేలు రికవరీకి ఆదేశం

ఉంగుటూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2021–22 ఆర్థిక సవత్సరంలో మండలంలోని 27 గ్రామాల్లో రూ.7.16కోట్లతో చేపట్టిన 1114 పనుల సామాజిక తనిఖీలో పలు అవకతవకలకు సంబంధించి రూ.95 వేలు రికవరీ చేయవలసిందిగా హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ, డ్వామా పీడీ జీవీ సూర్యనారయణ ఆదేశించారు. ఈనెల13 నుంచి సామాజిక తనిఖీ బృందం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులు, అవక తవకలను వివరించారు. పనులకు సంబంధించిన తుది నివేదిక వివరాలను మంగళవారం రాత్రి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ప్రజా వేదికలో డ్వామా పీడీ, ఏపీడీలు శ్రీలత, వెంకటరమణ, విజిలెన్స్ అధికారి నాగలక్ష్మిల సమక్షంలో తుది నివేదికను వివరించారు. నిబంధనల ప్రకారం పనులు చేయించకపోవటం, కూలీలకు వేసే హాజరులో అవకతవకలు, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, మొక్కల పోషణ నిర్వాహణలోపం, ఎంపీడీవో సంతకం చేయాల్సిన చోట రబ్బరు స్టాంప్ సంతకాలు వేసి వేతనాలు చెల్లించడం వంటి అవకతవకలను గుర్తించారు. రూ.95 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. రబ్బరు స్టాంపు సంతకం విషయంలో పీవో, ఏపీవోకి షోకాజ్ నోటీసులు ఇవ్వాల్సిందిగా పీడీ జిల్లా విజిలెన్స్ అధికారులకు సిఫార్సు చేశారు.

తరలివచ్చె తనే వసంతం

- శోభకృత్‌నకు ఘనంగా ఆహ్వానం పలికిన ప్రజలు
- ఊరూవాడా అంబరాన్నంటిన ఉగాది సంబరం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలు చోట్ల పంచాంగ శ్రవణాలు



కైకలూరులో ఉగాది పురస్కారాలు అందుకున్న వ్యక్తులు



కొండలమ్మవారి సన్నిధిలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు



కైకలూరులో పంచాంగ ప్రతులను అందిస్తున్న నోరి సుబ్రహ్మణ్య శాస్త్రి

కైకలూరు: ఉగాది సంబరం అంబరాన్నంటింది. శోభకృత్ నామ సంవత్సరాదికి ప్రజలు ఉత్సాహంగా ఆహ్వానం పలికారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కొత్త సంవత్సరంలో అంతా తమకు మంచి జరగాలని వేడుకొన్నారు. పలుచోట్ల పండితులు పంచాంగ శ్రవణం వినిపించారు.

సమృద్ధిగా వర్షాలు.. పంటలకు మేలు

శ్రీశోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్రంలో వర్షాలు తగినంతగా కురిసి, పాడిపంటలు బాగుంటాయని బ్రహ్మశ్రీ నోరి సుబ్రహ్మణ్య శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది సందర్భంగా కైకలూరు శ్యామలాంబమ్మవారి దేవస్థానంలో పంచాంగ శ్రవణం బుధవారం నిర్వహించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన శ్రవణ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యశాస్త్రీ పలు అంశాలను వివరించారు. ప్రసాదాలను భక్తులకు అందించారు. కార్యక్రమంలో శ్యామలాంబ, రామలింగేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్లు గుర్రం రాంబాబు, బూరుబోయిన మోహన రావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

సకల శుభాలను కలిగించే శోభకృత్

పామర్రు: సకల శుభాలను కల్గించే శోభకృత్ నామ సంవత్సరం అందరికీ సంతోషాలను సుఖాలను కలుగజేయాలని పలువురు ద్విజులు పంచాంగ శ్రవణంలో బుధవారం పేర్కొన్నారు. ఉగాది పండుగ నేపథ్యంలో పలు ఆలయాలలో పంచాంగ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక విష్ణాలయం, అంకమ్మతల్లి దేవాలయం, కన్యకాపరమేశ్వరీ ఆలయం, మండల పరిధి నిమ్మకూరు గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కళా పరిషత్ సభ్యుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించారు. అంకమ్మతల్లి ఆలయంలో పద్మశ్రీ ఘంటసాల–బాలు స్మారక సంగీత కళాపీఠం వారి ఆధ్వర్యంలో లంక భీష్మకుమార్ చే పంచాంగ శ్రవణం జరిగిందని కళాపీఠం అధ్యక్ష ఉపాధ్యక్షులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, కోటి పాండురంగారావులు తెలిపారు. అనంతరం పండిత సత్కారాలను నిర్వహించామన్నారు. నిమ్మకూరు గ్రామంలో బుధవారం కళా పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన పంచాంగ శ్రవణం –పండిత సత్కార సభకు మానవత సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అతిథిగా పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో..

గుడ్లవల్లేరు:శ్రీ కొండలమ్మవారి ఆలయ సన్నిధిలో ఉగాదిని పురస్కరించుకొని బుధవారం బ్రహ్మశ్రీ జె.పి.వి.ఎస్.శర్మచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలను చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఈఓ కానూరి సురేష్, చైర్మన్ శేషం గోపి, ధర్మకర్తలు పామర్తి వెంకటస్వామి, కొమ్మనబోయిన రవిశంకర్, వల్లూరు వెంకట్రావు, బాడిగ లీలా సౌజన్య, నారేపాలెం వెంకట నిర్మల, డోకాల భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వాడవాడలా ఉగాది వేడుకలు

మండవల్లి: మండవల్లిలోని అన్ని గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రజలు వేకువజామున నిద్రలేచి స్నానమాచరించి, నూతన వస్త్రాలు ధరించి ఉగాది పచ్చడి తీసుకుని పెద్దల దీవెనలు తీసుకున్నారు. అనంతరం ఆలయలకు వెళ్లి తమ ఇష్ట దైవాలను పూజించి, ఏడాది పొడవునా సుఖ, సంతోషాలతో జీవించే విధంగా స్వామి వారిని వేడుకున్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

తోట్లవల్లూరు: ఉగాది పర్వదిన వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెలుగు సంవత్సరాదిని మండల వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పిల్లలు, పెద్దలు నూతనవస్త్రాలు ధరించి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆలయాలలో ప్రత్యేకపూజలు జరపటంతోపాటు పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. బొడ్డపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించటంతోపాటు అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసమూర్తి పంచాంగ శ్రవణం జరిపారు.

భక్తి శ్రద్ధలతో పంచాంగ శ్రవణం

గుడివాడటౌన్ : శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పంచాంగ శ్రవణం భక్తిశ్రద్ధలతో జరిపారు. స్థానిక శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో పట్టణ బ్రాహ్మణ సేవా సమితి, గుడివాడ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన పంచాంగ శ్రవణంలో ఘనాపాటి జంధ్యాల రాజరాజేశ్వర శాస్త్రి పంచాంగ శ్రవణం జరిగింది. స్థానిక పాటిమీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరిగిన పంచాంగ శ్రవణంలో తాడేపల్లిగూడెంకు చెందిన కొడవటిగంటి వెంకట రాజన్ పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. స్థానిక బేతవోలులోని శ్రీ ఆనందేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆర్‌వీఎల్ నరసింహరావు పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎస్ సత్యానందం పాల్గొన్నారు.

ఆలయాల్లో పంచాగ శ్రవణాలు

ముదినేపల్లి రూరల్ : మండలంలోని పలు ఆలయాల్లో ఉగాది సందర్భంగా బుధవారం పంచాగ శ్రవణాలు నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రముఖ వేదపండితులు ఆసూరి రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సరంలో వ్యవసాయం అనుకూలంగా ఉంటుందని పాడిపంటలు పుష్కలంగా లభ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ శ్రవణానికి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకాగా ఆలయ చైర్మన్ శౌంతి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణ చేశారు. రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి జగన్నాథ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన పంచాగ శ్రవణంలో ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్, పాలకవర్గ సభ్యులు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ముగ్గురికి ఉగాది పురస్కారాలు

కైకలూరు: శ్రీశోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ముగ్గురు వ్యక్తులకు కైకలూరు సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో ఉగాది పురస్కారాలను బుధవారం ప్రదానం చేశారు. సామాజిక సేవ చేస్తున్నందుకు లావేటి వీరశివాజీ, కొల్లేరు ప్రజల సమస్యలపై పోరాడిన బలే రామయ్య, విశ్రాంతి హెచ్ఎం, సాహితీవేత్త చిట్టి పార్వతీశంకు ప్రతి ఏటా ప్రకటించే ఉగాది పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. సాహితీ మిత్రుల అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపల్లి బాలకృష్ణరావు, చింతపల్లి వెంకటనారాయణ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది గురజాడ ఉదయశంకర్ హాజరయ్యారు. చిట్టి పార్వతీశం రచించిన 'కైకలూరు పట్టణ ఆలయాలు, పి.శ్రీరామమూర్తి రచించిన శివస్మృతి రచన పుస్తకాలను గురజాడ ఉదయశంకర్, తుమ్మలపల్లి బాల కృష్ణారావు ఆవిష్కరించారు.



బొడ్డపాడులో వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పంచాగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు



గుడివాడ వీరాంజనేయ స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న ఘనాపాటి



పామర్రులో బ్రాహ్మణులను సత్కరిస్తున్న కళాపీఠం సభ్యులు

ప్రముఖులకు ఉగాది పురస్కారాలు

పామర్రు: పలురంగాలలో విశిష్ట సేవలను అందించిన వారిని గుర్తించి వారికి ఉగాది పురస్కారాలను అందించామని ఘంటసాల కళాపీఠం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, కోటి పాండురంగారావు బుధవారం తెలిపారు. స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో భారత వికాస్ పరిషత్ కార్యదర్శి పూసల కృష్ణ మల్లిఖార్జున ప్రసాద్, విశ్రాంత హెచ్ఎం కొవ్వలి సూర్య ప్రకాశరావు, ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాద్, గో పరివార్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తోట సురేష్, రోష్ణ ట్రేడర్స్ అధినేత కె. శ్రీధర్, మాజీ సర్పంచ్ వెన్నా వాణిశ్రీ, రిటైర్డు అడిషనల్ ఎస్పీ శాయన సుశీలరావులకు ఉగాది పురస్కారాలను అందజేశామని అన్నారు. అనంతరం కళా పరిషత్ అధ్యక్షులు కేవీ మురళీ కృష్ణకు అప్పా అసోసియేషన్, భారత వికాస్ పరిషత్, ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యుల అందరూ కలిసి పామర్రు ఘంటసాల అనే బిరుదును ప్రదానం చేశారు. తదుపరి కంకిపాడుకు చెందిన శబరి మలై అయ్యప్ప సేవా సంఘం సభ్యులు మురళీ కృష్ణను ఘనంగా సన్మానించారు.



పామర్రులో కాటూరి వెంకట మురళీ కృష్ణను సన్మానిస్తున్న సభ్యులు

విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు

గుడివాడటౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానం, జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, బేతవోలులోని ఆనందేశ్వరస్వామి వారి దేవస్థానం, బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానం, శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు సంవత్సరం ప్రారంభానికి సూచనగా ఈ పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ తెలిపారు.

22 జీడివి 25 : విఘ్నేశ్వర స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్
- కాళ్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): గ్రామాల్లో సమస్యల పరిష్కార వేదికగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిలుస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కాళ్లపాలెం గ్రామంలో 192వ రోజు గడపగడపకు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత గ్రామంలో దివంగత వంగవీటి మోహనరంగా, పేటేటి వెంకట కృష్ణారావు విగ్రహాలకు నివాళులర్పించారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన కుటుంబాలకు సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 72 సచివాలయాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. సమస్యలను గుర్తించి తక్షణం పరిష్కరించామని తెలిపారు. పలువురు గ్రామస్తులు తమ గ్రామంలో రహదారులు నిర్మించాలని, లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరుతోందని, ఆధార్ కార్డులలో వయసు తప్పుపడిందని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీలు చందన ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీ రామ దుర్గాప్రసాద్, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఎంపీటీసీ సభ్యుడు పేటేటి రామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, నాయకులు కందుల వెంకటేశ్వరరావు, గోదావరి సత్యనారాయణ, నున్న రామచంద్రరావు, నున్న కృష్ణబాబు, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ చాంద్ భాషా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, గృహసారథులు, రూరల్ సర్కిల్ సీఐ వైవీఎల్ నాయుడు, విద్యుత్‌శాఖ ఏఈ మల్లికార్జునరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరు అందించాలి

మండవల్లి: ఏలూరు, రైవస్, బందరు కాలువలను విజయవాడలో కలుషితం కాకుండా చర్యలు తీసుకుని సురక్షతమైన తాగునీరు అందించాలని సామాజికవేత్త ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, కె.సూర్యారావు కోరారు. ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్ వద్ద బందరు, రైవస్ ఏలూరు కాలువలను విజయవాడలో కలుషితం కాకుండా చూడాలని ప్లకార్డులు ప్రదర్శించారు. విజయవాడ మహానగరంలోని దాదాపు 29 మురుగు కాలువల నీరును పంట కాలువలోకి కలపటంతో నీరు పూర్తిగా కలుషితమై ప్రవహిస్తోందన్నారు. దీనిని ప్రక్షాళన చేయాలన్నానరు. కార్యక్రమంలో ఇంటి ఝాన్సీరాణి, ఆర్. సుధారాణి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

నున్న (విజయవాడ రూరల్): నున్న గ్రామ పంచాయతీ వద్ద పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఒక్కో కార్మికుడికి రెండు జతల చొప్పున దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తవ్వి వదిలేశారు!



ముదినేపల్లి సెంటర్లో నిలిచిన మురుగు నీరు

ముదినేపల్లి రూరల్ : జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లి పంచాయతీ పరిధిలోని తవ్విన కాలువలు ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయి. వివరాల్లోకి వెళితే.. కత్తిపూడి – పామర్రు 165వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు ఇటీవల ప్రారంభించారు. ఈ పనులు మండలంలో చురుగ్గా సాగుతున్నప్పటికీ ముదినేపల్లి సెంటర్లో రహదారికి ఇరువైపులా చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణంలో జాప్యం వల్ల సమస్య తలెత్తింది. ఈ రహదారికి ఇరువైపుల గతంలో పంచాయతీ ఏర్పాటు చేసిన డ్రెయిన్లు ఉండేవి. రహదారి విస్తరణలో భాగంగా ముదినేపల్లి సెంటర్లోని పలు షాపులు కూల్చివేసి రెండు వైపులా డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గత డ్రెయిన్లను పూడ్చివేసి కొత్త నిర్మాణానికి కాలువలు తవ్వి వదిలేశారు. ఐదు నెలలు గడుస్తున్నా పనులు ఓ కొలిక్కి రాలేదు. మురుగునీరు ప్రవహించే అవకాశం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిమ్మగడ్డ భిక్షాలు ఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు పోయే మార్గం లేక ముదినేపల్లి సెంటర్ పూర్తిగా నీటితో నిండిపోయింది. తవ్విన గోతుల్లో నీరు నిలిచిపోవడంతో షాపుల యజమానులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రెయిన్ల నిర్మాణం వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి అధికారులను పలుమార్లు కోరినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని భిక్షాలు ఆవేదన వ్యక్త చేశారు. ఇప్పటికైనా డ్రెయిన్ల నిర్మాణాలు పూర్తిచేయించాలని డిమాండ్ చేశారు.

నేడు, రేపు విశేష పూజలు

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో రామమందిరంలో ఈనెల 23, 24 తేదీల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. 23న ఉదయం 8 గంటల నుంచి విఘ్నేశ్వరుని పూజ, అంకురార్పణ, అభిషేకం, మహా శాంతి హోమం, 24న ఉదయం 7 గంటల నుంచే హోమాలు, విశేష పూజలు, ఉదయం 9.54 గంటలకు పోతురాజు స్తంభ ప్రతిష్ఠ, శ్రీరాముల వారి విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం జరుగుతాయని కమిటీ పేర్కొంది. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

భవన నిర్మాణాలకు శంకుస్థాపన



జుఝువరంలో సచివాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

జుఝువరం(పామర్రు): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి గ్రామ సచివాలయ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందని పామర్రు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధి జుఝువరం గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్ర, వైఎస్సార్ ఆరోగ్య కేంద్ర భవనాల నిర్మాణాలకు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవనసముదాయాన్ని సుమారు రూ.76.75లక్షల అంచనా విలువలతో శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కె. స్వరూపరాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దొంతిరెడ్డి శ్రీరామిరెడ్డి, వైస్ ఎంపీపీ ఏ రమాదేవి, గ్రామ సర్పంచ్ పుట్టి పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి పెట్టాలి

గన్నవరం: ఆరోగ్యకరమైన నవ సమాజం కోసం యువత క్రీడలపై దృష్టి సారించాలని ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్‌కె.ప్రసాద్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. తొలుత ఈ పోటీలను ప్రారంభించిన టీఎస్ఆర్‌కే మాట్లాడుతూ..రానున్న రోజుల్లో క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు మరిన్ని పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పోటీల స్పాన్సర్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు సంకాబత్తు వెంకట్‌ను అభినందించారు. అనంతరం ఈ పోటీల్లో విజేతగా నిలిచిన గన్నవరం పోలీసుల జట్టుకు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు, హెచ్‌సీఎల్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు.

ధ్యాన సాధనతోనే మార్పు



మాట్లాడుతున్న దీప్తి ప్రసన్న

రామవరప్పాడు: ధ్యాన సాధనతో మంచి మార్పు, మానవత్వం, భౌతిక, ఆధ్యాత్మిక భావాలు సొంతమవుతాయని స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ప్రతినిధి దీప్తి ప్రసన్న అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని శ్రీ శక్తి కల్యాణ మంటపంలో బుధవారం శ్రీ గురు విశ్వస్ఫూర్తి ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గురు విశ్వస్ఫూర్తి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గురు విశ్వస్ఫూర్తి మానవాళికి అనుగ్రహించిన 'ధ్యాన మనో ప్రస్థాన సాధన' ప్రదర్శన నిర్వహించారు. సభాధ్యక్షుడు పైడిపాటి ఉమానాథ శర్మ మాట్లాడుతూ ధ్యాన మనో ప్రస్థాన సాధనతో మనస్సు, బుద్ధి, ఆత్మ స్పష్టతతో మనిషి తనను తాను తెలుసుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆథర్ మేక రజనీకాంత్, సత్యవతి, ట్రస్టీలు భానుకృష్ణ, ప్రసాద్, రాఘవరావు, సౌజన్యశ్రీ, జోనల్ ఇన్చార్జి రత్న కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.